సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025





ర్యాంప్‌పై 'ఫరెవర్ మిస్ ఇండియా విశాఖపట్నం 2025' విన్నర్ సృజన

'మిస్ విశాఖ'గా డాక్టర్ సృజన

ఏయూక్యాంపస్: నగరంలోని యువతులు, తమ స్టైల్, గ్లామర్‌తో ర్యాంప్‌పై సందడి చేశారు. సరికొత్త డిజైనర్ వేర్ ధరించి, ఫ్యాషన్ ప్రపంచంలో తమదైన ముద్ర వేశారు. ఆత్మవిశ్వాసంతో కూడిన వారి అడుగులు, ఆకట్టుకునే భంగిమలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రతి యువతి తనదైన స్టైల్‌తో ర్యాంప్‌పై తళుక్కున మెరిసింది. ఆదివారం ఓ హోటల్‌లో 'ఫరెవర్ మిస్ ఇండియా విశాఖపట్నం 2025' పోటీలు నిర్వహించారు. 'మిస్ విశాఖ' గా డాక్టర్ సృజనదేవి నిలిచారు. ప్రముఖ ఫొటోగ్రాఫర్ బీకే అగర్వాల్ , కరణం రెడ్డి నరసింగరావు ఆమెకు అందాల పోటీ కిరీటాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యార్లగడ్డ గీత, నాగమణి, డాక్టర్ మీనాక్షి అనంత రామ్ తదితరులు పాల్గొన్నారు.

● గంగమ్మ చెంతకు గణపతి





పూజలు అందుకున్న బొజ్జ గణపతికి నగరవాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం గణనాథులను ఘనంగా నిమజ్జనం చేశారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రజలంతా సాగరతీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో బీచ్‌రోడ్డు మొత్తం కోలాహలంగా మారిపోయింది. డప్పుల మోతలు, భజన కీర్తనల మధ్య భక్తులు వినాయక విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

నర్తన గణపతిగా సంపత్ వినాయగర్



మహారాణిపేట: ఆశీలమెట్టలో కొలువైన శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో జరుగుతున్న శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీ నర్తన గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారిని వివిధ అలంకరణల్లో అలంకరిస్తున్నారు. ఈ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ రెండో విడత ప్రారంభం

మహారాణిపేట: రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తొలి విడత ఆదివారంతో పూర్తయింది. రెండో విడత పంపిణీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇకపై అన్ని రేషన్ డిపోల్లో స్మార్ట్ రేషన్ కార్డులు ఉంటేనే సరుకులు పంపిణీ చేస్తారు. గత నెల 26 నుంచి ఈ నెల 31 వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్‌వో) వి.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలో మొత్తం 5,17,155 కార్డులకు గాను 1,76,100 కార్డులు మాత్రమే పంపిణీ అయ్యాయి. ఇంకా 3,41,055 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. సెప్టెంబర్ నెల రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారానే తీసుకోవాలని డీఎస్‌వో స్పష్టం చేశారు. ఈ పంపిణీ ప్రక్రియను డీఎస్‌వో ఆధ్వర్యంలో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారులు (ఏఎస్‌వో), చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు (సీఐ), సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్, సీపీ బాగ్చీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి మంగళవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పరిశీలించారు. ముందుగా, కోస్టల్ బ్యాటరీ వద్ద ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించి, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం, మంగళవారం నోవోటెల్ హోటల్‌లో జరగనున్న 'ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్' ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్ వద్ద దుమ్ము రేగకుండా నీరు చల్లడం, వీఐపీల జాబితా సిద్ధం చేయడం, నోవోటెల్ హోటల్‌లో మూడు వేర్వేరు సమావేశాల నిర్వహణ, ముఖ్యమంత్రికి గ్రీన్ రూమ్ ఏర్పాటు, సీటింగ్, వీఐపీ ప్రోటోకాల్ వంటి అంశాలపై వారు అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అజిత, ఆర్డీవో శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధం



వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేకే రాజు. చిత్రంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి తదితరులు

- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ
- పార్టీ నేతల సలహాలు, సూచనలతో సమన్వయ కమిటీ ఏర్పాటు
- బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలి
- వైఎస్సార్ సీపీ కేడర్‌కు శాసనమండలి విపక్షనేత బొత్స పిలుపు
- కేకే రాజు అధ్వర్యంలో జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రుల ఆత్మగౌరవంగా భావించే విశాఖ ఉక్కును కాపాడటానికి ఎలాంటి పోరాటాలకైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ముందుకొచ్చే ఇతర పార్టీలను, కార్మిక నాయకులను కలుపుకుని పోరాటం చేస్తామని ఆయన అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అధ్వర్యంలో ఆదివారం పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ విశాఖలో మూడు రోజుల పాటు ఉన్న పవన్‌కల్యాణ్.. స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడకుండా వెళ్లిపోయారని, ఈ ప్రాంత ప్రజల, కార్మికుల కుటుంబాల ఆవేదన ఆయనకు కనిపించలేదా అని ప్రశ్నించారు.

సమావేశంలో కీలక నిర్ణయాలు

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. పోరాటానికి మద్దతు ఇచ్చే ఇతర పార్టీలు, కార్మిక సంఘాలతో త్వరలో రౌండ్ టేబుల్ మిగతా 8లో

కౌన్సిల్‌కి ఇచ్చిన గౌరవం ఇదేనా..?

- మేయర్ తీరుపై మండిపడుతున్న కార్పొరేటర్లు
- కౌన్సిల్ జరిగి పది రోజులైనా మేయర్ సంతకానికి నోచుకోని ఆమోదం పొందిన అంశాలు

అల్లిపురం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ముగిసి పది రోజులు గడుస్తున్నా, అందులో తీసుకున్న నిర్ణయాలపై మేయర్ ఇప్పటికీ సంతకం చేయకపోవడంపై కార్పొరేటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కౌన్సిల్‌కు ఇచ్చే గౌరవం అని ప్రశ్నిస్తూ, ఇలా అయితే నగరాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. నగర మేయర్‌గా పీలా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు పూర్తయ్యాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో 135 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టగా, ఒక అంశం మినహా మిగిలిన 134 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటిలో వార్డుల్లో అభివృద్ధి పనులు, పలు టెండర్లకు సంబంధించినవి కూడా ఉన్నాయి. కౌన్సిల్ ఆమోదం పొందిన అంశాలపై మేయర్ సంతకం చేయాల్సి ఉండగా, ఆయన ఇప్పటివరకు సంతకం చేయకపోవడంతో కార్పొరేటర్లు ఆగ్రహంగా ఉన్నారు. జీవీఎంసీ పాలకవర్గానికి మరో ఆరు నెలల గడువు మాత్రమే మిగిలి ఉంది. ఈలోగా మరో కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పనులు వేగవంతం చేయడానికి టెండర్లు పిలిచి, పనులు మొదలుపెట్టాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు అంటున్నారు. కానీ మేయర్ నిర్ణయం తీసుకోకపోవడంపై వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

పోస్టులు సరే.. అధికారులెక్కడ?

- గందరగోళంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ వ్యవహారం
- ఉన్నతాధికారుల్ని నియమించినట్లు రైల్వే బోర్డు ఉత్తర్వులు
- జీఎం తప్ప.. విశాఖలో కనిపించని ఇతర అధికారులు
- ఎవరికీ కార్యాలయాలు లేక బాధ్యతల స్వీకరణకు నో.!



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటన వచ్చి ఆరేళ్లు దాటినా, దాని కార్యకలాపాలు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. కాగితాలపై చకచకా పనులు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం 'ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి' అన్న చందంగా పరిస్థితి మారిపోయింది. రైల్వే బోర్డు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా (జీఎం) సందీప్ మాథుర్‌ని రెండున్నర నెలల క్రితం నియమించింది. అదేవిధంగా, పలువురు ప్రిన్సిపల్ అధికారుల్ని కూడా నియమించారు. అయితే జోన్‌కు ఇంకా శాశ్వత కార్యాలయం లేకపోవడంతో జీఎం విశాఖకు అప్పుడప్పుడు వస్తూ పోతున్నారు. మిగతా అధికారులు మాత్రం బాధ్యతలు స్వీకరించడానికి వెనుకంజ వేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ ది డెక్, ఇతర రైల్వే భవనాలను తాత్కాలిక కార్యాలయాల కోసం రైల్వే బోర్డుకు పంపినా, ఇంతవరకు ఆమోదం లభించలేదు. దీంతో జీఎం విశాఖ రైల్వే గెస్ట్ హౌస్‌లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రిన్సిపల్ అధికారులను నియమించినా..?

జీఎం నియామకం తర్వాత పలు ప్రిన్సిపల్ పోస్టులను కూడా జోన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇండియన్ రైల్వేస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్) నుంచి ఒక ఎలక్ట్రికల్ అధికారిని, సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్ నుంచి పీసీఎంఈ (ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్)గా అమిత్ గుప్తాని నియమించారు. కానీ వీరు ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఎక్కడ బాధ్యతలు తీసుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి..

ప్రయాణికులు, ఉత్తరాంధ్ర ప్రజలు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి వీలైనంత త్వరగా గెజిట్ విడుదల చేయించాలని, తద్వారా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావాలని కోరుకుంటున్నారు.

గెజిట్ విడుదల కీలకం

ఈ దుస్థితికి ప్రధాన కారణం గెజిట్ విడుదల కాకపోవడమేనని వాల్తేరు అధికారులు అంటున్నారు. గెజిట్ విడుదలైన తర్వాతే తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభం కావడం సాధ్యమవుతుంది. గెజిట్‌తో పాటుగా కార్యచరణ ప్రకటిస్తే, జీఎంతో సహా మొత్తం 180 మంది అధికారులు, ఉద్యోగులు నియమితులవుతారు. అప్పుడు మాత్రమే జోన్ కార్యకలాపాలు మొదలవుతాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే, దసరా నాటికి కూడా ఈ పనులు పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీ ఎప్పుడు?

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- 8 నెలల క్రితం నర్సుల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్
- ఇప్పటి వరకూ పోస్టులు భర్తీ చేయని వైనం
- ఆందోళన చెందుతున్న నిరుద్యోగులు



మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలోనూ, కేజీహెచ్, ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. జనవరిలో విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం నర్సుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తక్షణం పోస్టులు భర్తీ చేసి తమను ఆదుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను (సోమవారం మంత్రి విశాఖ వస్తున్నారు) కోరుతున్నారు.

అధికారంలోకి వస్తే లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు మాట తప్పారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇది పారదర్శక పాలన కాదని వారు నిలదీస్తున్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను ఆకట్టుకున్న కూటమి నేతలు, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా పోస్టుల భర్తీపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీలు

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న 106 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వివిధ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనంగా మరో 264 నర్సుల పోస్టులు చేరాయి. వీటితో కలిపి మొత్తం 370 పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయం చర్యలు చేపట్టింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 8,300 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, కేజీహెచ్, రాణీ చంద్రమతి దేవి ఆస్పత్రి, శ్రీకాకుళం, విజయనగరం, పాడేరు ప్రభుత్వ ఆస్పత్రులు, క్యాన్సర్ వార్డులకు అదనంగా నర్సులు మంజూరు కావడంతో పాటు, పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీలతో కలిపి ఈ 370 పోస్టుల భర్తీకి ప్రక్రియ మొదలు పెట్టారు. అయితే డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి వచ్చిన ఆదేశాలతో 246 పోస్టుల భర్తీని నిలిపివేశారు.

టీచింగ్ ఆస్పత్రుల్లోనూ అదే పరిస్థితి

ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్స్‌లో మొత్తం 22 కేటగిరీల్లో 71 పోస్టుల భర్తీకి అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానించారు. వీటికి భారీగా దరఖాస్తులు వచ్చినా, ఇంతవరకు ఏ ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. నిరుద్యోగులు ప్రతిరోజూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

నర్సుల పోస్టుల భర్తీలో జాప్యం

124 నర్సుల పోస్టుల ఎంపిక జాబితాను విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ పోస్టులను వైద్య విధాన పరిషత్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆస్పత్రుల్లో భర్తీ చేస్తున్నామని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల్లో 90 పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 పోస్టుల భర్తీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

వైభవంగా రాధాష్టమి ఉత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం, గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధాష్టమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 11 గంటలకు శ్రీరాధా మదన్ మోహన మందిరం నుంచి శ్రీరాధా కృష్ణుల విగ్రహాలను సంకీర్తనలతో పల్లకీలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, పూలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా, శ్రీరాధా మదన్ మోహనుల విగ్రహాలకు సప్త నదులైన గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి నదుల జలాలతో అభిషేకం నిర్వహించారు. వీటితో పాటు 108 కలశాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలతో వేద మంత్రాల నడుమ అభిషేకాలు అంగరంగ వైభవంగా జరిగాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, శ్రీరాధా రాణి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. రాధాదేవి సాక్షాత్తు శ్రీకృష్ణుని అంతరంగిక శక్తి స్వరూపమని, ఆమె ఆరాధనకు ఇది ఒక అపురూప సమయమని అన్నారు. ఈ వేడుకలలో పాల్గొన్న సుమారు 500 మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసినట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస వెల్లడించారు.



హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో పల్లకీ ఉత్సవం

సందడిగా పూల అలంకరణ పోటీలు

హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం పూలదండలు, పుష్ప గుచ్చాల అలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 12 నుంచి 16 ఏళ్ల బాలబాలికలు, 16 ఏళ్లు పైబడిన మహిళలు కలిపి మొత్తం 112 మంది పాల్గొన్నారు. రాధాష్టమి సందర్భంగా జరిగిన ఈ పోటీలలో, అందరూ ఉత్సాహంగా వివిధ రకాల పూల అలంకరణలు చేశారు. జయంతి దేవివాసికి ప్రథమ బహుమతి(రూ.50వేలు), ద్వితీయ బహుమతి కె.జయలక్ష్మి (రూ.40వేలు), తృతీయ బహుమతి కె.సుధ (రూ.25 వేలు) కైవసం చేసుకున్నారు. వీరికి హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అందజేశారు. ఈ పోటీలకు ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి ఆముక్త మాల్యద న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.



మొదటి బహుమతి అందుకుంటున్న జయంతి

ఆ చిన్నారికి చేయూత కావాలి

- క్యాన్సర్‌తో బాధపడుతున్న అయాన్‌తేజ్
- రూ. 20లక్షలు ఖర్చవుతుందని చెబుతున్న వైద్యులు
- ఇప్పటికే ఇల్లు, కారు అమ్మి వైద్యం చేయిస్తున్న తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురు చూపు



ఆస్పత్రిలో తేజ్..



తల్లిదండ్రులు వాసు,పావని

గోపాలపట్నం: చిరునవ్వుల ఆనందంతో గడపాల్సిన ఒక ఏడాది చిన్నారి, పుట్టినప్పటి నుంచే జీవితంతో పోరాడుతున్నాడు. ఎన్. అయాన్ తేజ్ అనే ఈ పసివాడు 'విస్కోట్ ఆల్డ్రిచ్ సింర్డోమ్' అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా అతనిలో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటంతో పాటు రోగ నిరోధక శక్తి కూడా క్షీణించింది. ఫలితంగా నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ, చూపును కూడా కోల్పోయాడు. అయాన్ తేజ్ తల్లిదండ్రులు నిటిపల్లి వాసు, పావని తమ కొడుకు కోసం గత ఏడాది కాలంగా అష్టకష్టాలు పడుతున్నారు. అతడి చికిత్స కోసం ఇప్పటికే తమ ఇల్లు, కారు కూడా అమ్ముకుని దాదాపు రూ.16 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడు తమ కొడుకును బతికించుకోవడానికి వారికి కేవలం ఒకే ఒక మార్గం ఉంది..హాల్ఫ్ ఐడెంటికల్ బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్. ఈ చికిత్సకు సుమారు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఇందులో రూమ్ ఛార్జీలు, మందులు, బ్లడ్ ప్రొడక్షన్, స్టీమ్ సెల్ ప్రాసెసింగ్ వంటి పలు ఖర్చుల కోసం లక్షల రూపాయలు అవసరమవుతాయి.

కుటుంబ సభ్యుల నుంచి ..

అయాన్ తేజ్ కు హాఫ్లో ఐడెంటికల్ బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలి. ఇందుకు అతని కుటుంబ సభ్యుల నుంచి బోన్ మారో సేకరించి అది బాబుకు సరిపోతుందో లేదో పరీక్షించాలి. ఇంట్లో ఉన్న ముగ్గురికి ఈ పరీక్షలు చేయించడానికి అదనంగా రూ.వేలల్లో ఖర్చవుతుంది. అదృష్టవశాత్తు, అయాన్ తేజ్ అన్న బోన్ మారో సరిపోయినట్లయితే, చికిత్స ప్రారంభించవచ్చు. ఇప్పటికే తమకున్నదంతా ఖర్చు చేసిన ఆ కుటుంబానికి ఈ మొత్తం భరించడం అసాధ్యం. దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రుల హృదయవేదన చూసి పలువురు కన్నీటిపర్యంతమవుతున్నారు.

దాతల సాయం కోసం..

అయాన్ తేజ్ చికిత్స కోసం దాతల నుంచి సాయాన్ని తల్లి దండ్రులు కోరుతున్నారు. వీరి ఫోన్‌పై నంబర్ 9014097133, అకౌంట్ నంబర్ 37760806272, ఐఎస్ఎఫ్ కోడ్: ఎస్‌బీఐఎన్0004816 ఎకౌంట్ హోల్డర్ పేరు నిటిపల్లి వాసు.

ఆరుగురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్


పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో సముద్రంలో కొట్టుకుపోతున్న పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. ఆదివారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 15 మంది యువతీ యువకుల బృందం రుషికొండ బీచ్‌ను సందర్శించడానికి వచ్చింది. వీరు సముద్రంలో స్నానం చేస్తుండగా, అలల ఉధృతి కారణంగా వారిలో ఆరుగురు నమన్, చంద్రకర్, అంజు, ఖుష్బూ యాదవ్, గౌరవ్ సాహు, ఆరుషి సింఘా, రోహన్ చంద్రుకర్ కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన లైఫ్‌గార్డ్స్ ఎస్. నూకరాజు, ఎం. అమ్మోరు, చందు, సతీష్, గురుమూర్తి, చిన్నప్పన్న, వెంకటేష్, దేవ, రాజ్‌కుమార్ వెంటనే స్పందించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

15 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

డాబాగార్డెన్స్: ఈ నెల 15 నుంచి జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు వెళ్లనున్నారు. అధ్యయన యాత్రలో భాగంగా కార్పొరేటర్లు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, జైపూర్, జైసల్మేర్ మున్సిపాలిటీలు సందర్శించనున్నారు. యాత్రలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది మొత్తంగా 130 మంది వెళ్లనున్నట్టు సమాచారం. 8 రోజుల పాటు ఆయా మున్సిపాలిటీల్లో పర్యటించి అక్కడ అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేయనున్నారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్‌గా సత్యనారాయణరాజు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ (సీఈ)గా సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఇన్‌చార్జ్ సీఈగా ఉన్న పల్లంరాజు స్థానంలో సత్యనారాయణరాజుకు పదోన్నతి కల్పించారు. ఆయన గతంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా విధులు నిర్వహించారు. అదే విధంగా జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈగా కేవీఎన్ రవి పదవీ విరమణ చేయడంతో, ఆ స్థానంలో ఏడుకొండలు ఇన్‌చార్జ్ ఎస్ఈగా నియమితులయ్యారు.

వృద్ధురాలి కళ్లు, దేహం దానం


సూర్యకాంతం పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న ఆమె కుమారుడు

పీఎం పాలెం: తాను మరణించిన తర్వాత పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించాలన్న తల్లి చివరి కోరికను ఒక కొడుకు నెరవేర్చాడు. దీనికి సంబంధించిన వివరాలివి. పీఎం పాలేనికి చెందిన 88 ఏళ్ల వడ్డే సూర్యకాంతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తాను మరణించిన తర్వాత తన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు, శరీరాన్ని గాయత్రీ మెడికల్ కాలేజీకి అప్పగించాలని ఆమె తన కుమారుడు నాగేంద్రబాబుకు సూచించారు. ఆదివారం ఆమె మరణించగా, నాగేంద్రబాబు తన తల్లి కోరిక మేరకు సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టీ సురేఖ ఆధ్వర్యంలో ఆమె పార్థివ దేహాన్ని ఆస్పత్రికి అప్పగించారు.

ఆటో, బైక్ ఢీ.. నలుగురికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తులు


పెందుర్తి పెద్ద చెరువు వద్ద ప్రమాద దృశ్యం

ఇద్దరి పరిస్థితి విషమం

పెందుర్తి: పెందుర్తిలోని పెద్ద చెరువు సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలివి.. సరిపల్లికి చెందిన కండిపల్లి కన్నయ్య తన ఆటోలో భార్య దేవి, కుమార్తె భారతి, కోడలు నాగమణితో కలిసి అక్కిరెడ్డిపాలెం వెళుతున్నారు. వీరు పెందుర్తి పెద్ద చెరువు వద్దకు చేరేసరికి.. అదే సమయంలో చినముషిడివాడ నుంచి బైక్‌పై ఇద్దరు యువకులు వస్తున్నారు. ఒక్కసారిగా బైక్,ఆటో ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు, ఆటోలో ఉన్న కన్నయ్యతో పాటు అతని భార్య దేవి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెస్ టోర్నీ విజేతలు సాత్విక్, ఆదిత్య

విశాఖ స్పోర్ట్స్: ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో, ఆంధ్ర చెస్ సంఘం పర్యవేక్షణలో వాల్తేర్ క్లబ్‌లో రెండు రోజుల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ర్యాపిడ్ విభాగంలో సాత్విక్ విజేతగా నిలవగా, బ్లిట్జ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌ను ఫిడే మాస్టర్(ఎఫ్ఎం) ఆదిత్య వరుణ్ కైవసం చేసుకున్నారు.

ర్యాపిడ్‌లో సాత్విక్‌దే పైచేయి

తొమ్మిది రౌండ్ల పాటు హోరాహోరీగా సాగిన ర్యాపిడ్ ఓపెన్ టోర్నీలో సాత్విక్, శ్రావ్యశ్రీ, నైనాలు ఎనిమిదేసి పాయింట్లతో సమంగా నిలిచారు. అయితే మెరుగైన టై బ్రేకర్ స్కోర్ ఆధారంగా సాత్విక్‌ను విజేతగా ప్రకటించారు. కేవలం ఎనిమిదో ర్యాంక్‌తో టోర్నీని ప్రారంభించిన సాత్విక్ అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచి తన ఫిడే రేటింగ్‌ను 23 పాయింట్లు మెరుగుపరుచుకున్నాడు. శ్రావ్యశ్రీ 11వ ర్యాంక్ నుంచి రెండో స్థానానికి, నైనా 15వ ర్యాంక్ నుంచి మూడో స్థానానికి ఎగబాకి సత్తా చాటారు. చివరి రౌండ్‌లో నైనాపై శ్రావ్యశ్రీ విజయం సాధించడం గమనార్హం. టోర్నీ టాప్ సీడ్, ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఆదిత్య 7.5 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్ (ఏఐఎం) రవికుమార్, షణ్ముఖ, శ్రీరామ్, శ్రీ అఖిల్ కూడా 7.5 పాయింట్లతో టాప్-8లో నిలిచారు. ఈ టోర్నీలో మొత్తం 332 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో 131 మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లు ఉన్నారు.


టాప్ బోర్డుపై ఆదిత్య(తెల్లపావులు)

బ్లిట్జ్‌లో ఆదిత్య వరుణ్ హవా

బ్లిట్జ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఆదిత్య వరుణ్ విజేతగా నిలిచాడు. ఆదిత్య, ఎరీనా ఫిడే మాస్టర్ (ఏఎఫ్ఎం) అర్నవ్, సాత్విక్, రామ్‌చరణ్‌లు ఎనిమిదేసి పాయింట్లు సాధించినప్పటికీ, మెరుగైన టై బ్రేకర్స్ ఆదిత్యను విజేతగా నిలబెట్టాయి. కాండిడేట్ మాస్టర్ (సీఎం) రుత్విక్, అఖిల్, శ్రీరామ్‌లు 7.5 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. మూడు నిమిషాల టైమ్ కంట్రోల్‌తో నిర్వహించిన ఈ బ్లిట్జ్ టోర్నీలో 285 మంది పాల్గొన్నారు. ర్యాపిడ్ చెస్ టోర్నీలో అండర్-7 కేటగిరీలో షణ్విక్ (బాలురు), సాయిశ్రీ (బాలికలు), అండర్-9లో శ్రీసాయి (బాలురు), శ్రీనిఖిల (బాలికలు), అండర్-11లో పర్వేష్ (బాలురు), అనన్య (బాలికలు), అండర్-13లో హర్షవర్ధన్ (బాలురు), త్రిపురాంబిక (బాలికలు), అండర్-15లో వెంకటేశ్వరరావు (బాలురు), లక్ష్మీ ప్రియ (బాలికలు), అన్‌రేటెడ్‌లో కుమార్, బెస్ట్ వుమెన్‌గా సుప్రీత, బెస్ట్ విశాఖ ప్లేయర్‌గా రమణబాబు, పీహెచ్‌సీ కేటగిరీలో జిగ్నేష్ విజేతలుగా నిలిచారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు సురేష్, ఆంధ్ర చెస్ సంఘం సలహాదారు కేవీవీ శర్మ, టోర్నీ డైరెక్టర్ మణికంఠ, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులందిస్తున్న అతిథులు

విశాఖ క్యారమ్స్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన

స్టేట్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ విజేతలుగా జనార్దనరెడ్డి, భవాని


పురుషుల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన సీహెచ్ జనార్దనరెడ్డి

చిలకలూరిపేట: సీఆర్ క్లబ్‌లో జరిగిన స్టేట్ ర్యాంకింగ్ క్యారమ్ పోటీల్లో విశాఖపట్నం క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నానికి చెందిన సీహెచ్ జనార్దనరెడ్డి పురుషుల విభాగంలో విజేతగా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఎన్. వెంకయ్య(నెల్లూరు), బి.జయకుమార్ (గుంటూరు), బి.పవన్‌కుమార్(అనంతపురం) ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు సాధించారు. మహిళల విభాగంలోనూ విశాఖపట్నం ఆధిపత్యం కొనసాగించింది. ఎ.భవాని, ఎల్.హరిప్రియ, ఎంఎస్‌కే హారిక, ఎస్‌కె హుస్నా సమీర మొదటి నాలుగు స్థానాల్లో నిలిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. మాల్దీవుల్లో జరగనున్న ఏడో ప్రపంచ కప్ క్యారమ్స్ పోటీల్లో జనార్దనరెడ్డి దేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా స్పాన్సర్‌గా వ్యవహరించిన సీఆర్ క్లబ్ ఆయనకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించింది. మొత్తం 150 మంది పురుష క్రీడాకారులు, 20 మంది మహిళా క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఏపీ స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ పర్యవేక్షించారు.

కేజీహెచ్ క్యాన్సర్ యూనిట్‌కు అత్యాధునిక పరికరాలు

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పరికరాలను నేడు ప్రారంభించనున్న మంత్రి


లినాక్ పరికరం

మహారాణిపేట: కేజీహెచ్ రేడియోథెరపీ విభాగంలో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఈ పరికరాలను సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ పరికరాల కోసం మొత్తం రూ. 45 కోట్లు ఖర్చు చేశారు. వీటిలో హెచ్‌డీఆర్ బ్రాచీ థెరపీ (రూ. 8 కోట్లు), లినాక్ (రూ. 22 కోట్లు), సీటీ సిములేటర్ (రూ. 10 కోట్లు) ఉన్నాయి. కేజీహెచ్‌లో 1983 నుంచి రేడియోథెరపీ విభాగం పనిచేస్తున్నప్పటికీ, ఇప్పుడు వచ్చిన ఈ అత్యాధునిక పరికరాల వల్ల క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయని కేజీహెచ్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్పా తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులలో లభించే ఆధునిక చికిత్స ఇప్పుడు కేజీహెచ్‌లో కూడా అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. గతంలో 2001 నుంచి టెలికోబాల్ట్-60 యంత్రంతో చికిత్స అందిస్తున్నారని ఆమె గుర్తు చేశారు.

హోరాహోరీగా ప్రో కబడ్డీ


ఉత్కంఠగా సాగుతున్న తమిళ్ తలైవాస్, ముంబా మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: పోర్టు స్టేడియం జరుగుతున్న ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ విశాఖ క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లు ప్రేక్షకులకు అసలైన కబడ్డీ మజాను పంచాయి. ఒక మ్యాచ్ చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగితే, మరో మ్యాచ్ పాయింట్ల వర్షంతో కనుల విందు చేసింది.

ఉత్కంఠ పోరులో ముంబా థ్రిల్లింగ్ విక్టరీ


ఊహించని మలుపులతో, చివరి క్షణం వరకు హోరాహోరీగా సాగిన పోరులో తమిళ్ తలైవాస్‌పై యు ముంబా 36-33 తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. తొలి అర్ధభాగంలో వెనుకబడిన ముంబా, ద్వితీయార్ధంలో అద్భుతంగా పుంజుకుంది. సమష్టి కృషితో ఆడి, చివరి ఐదు నిమిషాల్లో ఆటను పూర్తిగా తమవైపు తిప్పుకుని అభిమానులకు థ్రిల్లింగ్ విజయాన్ని అందించింది.

వారియర్స్ జోరు.. చాంపియన్‌కు షాక్

మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ పాయింట్ల సునామీ సృష్టించింది. డిఫెండింగ్ చాంపియన్ హర్యానా స్టీలర్స్‌ను 44-54 తేడాతో చిత్తు చేసింది. ఈ సీజన్‌లో 50 పాయింట్ల మార్కును దాటిన తొలి జట్టుగా నిలిచి తమ సత్తా చాటింది. వారియర్స్ కెప్టెన్ దేవాంగ్ ఏకంగా 21 పాయింట్లతో ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించడం ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. సోమవారం విశాఖ వేదికగా మరో రెండు ఆసక్తికరమైన మ్యాచ్‌లు జరగనున్నాయి. రాత్రి 8 గంటలకు పాట్నా పైరేట్స్, యూపీ యోధాస్, రాత్రి 9 గంటలకు పుణేరి పల్టన్, గుజరాత్ జెయింట్స్ మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

హక్కులు సాధించేందుకు పోరాటాలకు సిద్ధం

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్


మాట్లాడుతున్న గిరిబాబు

బీచ్‌రోడ్డు: వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం పెద్ద వాల్తేరులోని టీబీ ఆస్పత్రిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగులకు 36శాతం తాత్కాలిక భృతి ప్రకటించి, 12వ వేతన కమిటీ చైర్మన్‌ను నియమించి పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి 12వ పీఆర్సీ, 36శాతం ఐఆర్ చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు సాయి సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సంపాదిత లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో డైటీషియన్లకు వైద్య విద్యా సంచాలకుల విభాగంలో ఇన్‌సర్వీస్‌లో శిక్షణ పూర్తి చేసిన ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ చెల్లించాలని, 126 జీవోను సవరణ చేసి ఈఎస్ఐ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు పడాల రమణ యూనియన్ వజ్రోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు సారిపిల్లి గంగరాజు, కొర్రాయి రమేష్, ఎస్కే ఇబ్రహీం, ధనుంజయ్, శివశంకర్, రమాశంకర్, మహమ్మద్ దురానీ, ఎంఎస్ రఘునాథరావు, రఘు పాల్గొన్నారు.

● బోట్ పుల్లింగ్.. యాటింగ్.!

తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రంలోని ఐఎన్ఎస్ సర్కార్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. దక్షిణ భారత దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. బోట్‌పుల్లింగ్, యాటింగ్, షిప్ మోడలింగ్, డ్రిల్స్, టీమ్‌వర్క్ మొదలైన అంశాల్లో శిక్షణ అందించినట్లు తూర్పు నౌకాదళాధికారులు తెలిపారు. - సాక్షి, విశాఖపట్నం


శిక్షణలో పాల్గొన్న క్యాడెట్లు

ఉక్కు పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధం


జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

7వ పేజీ తరువాయి

సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను లూలూ మాల్ వంటి ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కూడా ఉద్యమ కార్యాచరణ రూపొందించారు.

పార్టీ బలోపేతంపై విస్తృత చర్చ

బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు, కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తమ వార్డుల అభివృద్ధి కార్యక్రమాల కోసం విశాఖ కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ చంద్రబాబు చెప్పిన స్క్రిప్ట్ చదవడానికే విశాఖకు వచ్చారని విమర్శించారు.

దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ..పవన్‌కల్యాణ్ నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, స్టీల్ ప్లాంట్‌కు నష్టం వస్తోందని చెప్పి ప్రైవేటీకరణను సమర్థిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, మాజీ మంత్రి బాలరాజు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, గతంలో ప్రైవేటీకరణ చేస్తే రాజీనామా చేస్తామని చెప్పిన వారు ఇప్పుడు మౌనంగా ఉన్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన నేతలు తెరవెనుక ప్రైవేటీకరణకు సహకరిస్తూ ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

సమావేశంలో ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి , చింతలపూడి వెంకట రామయ్య, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్‌లు కె.సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు, ముఖ్యనేతలు బొల్లవరపు జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ, కోలా గురువులు, రొంగలి జగన్నాథం, జియ్యాని శ్రీధర్, ఉరుకూటి అప్పారావు, వుడా రవి, రేయివెంకట రమణ ,బోని బంగారు నాయుడు , చెన్నా జానికీ రామ్, రాజనా వెంకటరావు, మువ్వల సురేష్ ,ద్రోణంరాజు శ్రీ వాస్తవ, పిల్లా సుజాత, పల్లా చిన్న తల్లి ,అల్లంపల్లి రాజు బాబు , డాక్టర్ జహీర్ అహ్మద్, సతీష్ వర్మ, రవి రాజు, చెన్న దాస్, అనిల్ కుమార్ రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్‌రావు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు అబంటి శైలేష్, పి.వి.సురేష్ , ఉరుకూటి రామచంద్రరావు (చందు), పేడాడ రమణి కుమారి, బోని అప్పల నాయుడు , సనపల రవీంద్ర భరత్ , బోని శివ రామకృష్ణ , బర్కత్ అలీ , సేనాపతి అప్పారావు , పీలా ప్రేమ కిరణ్ జగదీష్ , సకలభక్తుల ప్రసాద్ , కర్రి రామి రెడ్డి , రాయపు అనిల్ కుమార్ , కటికల కల్పన , వద్దాడి దిలీప్ కుమార్, మేడి ఆనందరావు,, వంకాయల మారుతీ ప్రసాద్ , బొండా ఉమా మహేశ్వర రావు , జీలకర్ర నాగేంద్ర , దేవర కొండ మార్కొండేయులు , నీలి రవి కార్పొరేటర్లు , జిల్లా పార్టీ కార్యదర్శిలు , రాష్ట్ర అనుబంధ విభాగం ఉపాధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం జోనల్ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు, జిల్లా పార్టీ అధికారిక ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగం సభ్యులు , మండల , డివిజన్ పార్టీ, అనుబంధ విభాగం కమిటీ సభ్యులు, పార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధినేత జగన్ దృష్టికి స్టీల్‌ప్లాంట్ సమస్య

బొత్సకు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు


శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు

మహారాణిపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంతో పాటు, ప్లాంట్‌లో ప్రకటించిన 34 డిపార్ట్‌మెంట్‌లలో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ల జారీ, అలాగే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వంటి సమస్యలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని స్టీల్ ప్లాంట్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకుడు డీవీ రమణ, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, 69వ వార్డు అధ్యక్షుడు భోగాది సన్నీ, 78వ వార్డు అధ్యక్షుడు రావాడ శివ, 86వ వార్డు అధ్యక్షుడు గద్దం శ్రీను, పార్టీ ప్రచార అధ్యక్షుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ మీనాక్షి


ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ మీనాక్షి

ఏయూక్యాంపస్: దేశంలో అనేక మంది ప్రజలు నేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఒకరు దానం చేసే నేత్రాలు మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతాయని ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు కంటి దానం పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మోహసీన్ ఐ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత 6 నుంచి 8 గంటల వ్యవధిలో నేత్రాలను దానం చేయవచ్చని తెలిపారు. నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ విభిన్న కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గాయత్రి మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ జ్యోతిర్మయి, ఎస్ఆర్ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ధర్మరాజులు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. బీచ్‌రోడ్డులో పాదచారులకు కరపత్రాలను పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు, ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్, మోహసీన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు, శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్, గీతం హాస్పిటల్, విశాఖ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరణించిన తండ్రి నేత్రాలు దానం


ఆడారి సూరి(ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన తండ్రి నేత్రాలను దానం చేసి ఆయన కుమారులు గొప్ప మనసును చాటుకున్నారు. పెందుర్తి మండలం చింతలగ్రహారం గ్రామానికి చెందిన ఆడారి సూరి (65) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్.. సూరి నేత్రాలను దానం చేయాల్సిందిగా కుటుంబ సభ్యులను అభ్యర్థించారు. మృతుడి భార్య సూర్యకాంతం, కుమారులు సన్యాసిరావు, సూరి అప్పారావు, కుమార్తె వరలక్ష్మి నేత్రదానానికి అంగీకరించారు. దీంతో మోహసీన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ నేతృత్వంలోని బృందం సూరి నేత్రాలను సేకరించింది.

'సెంచూరియన్'తో యూపీ ప్రభుత్వం ఒప్పందం


లక్నోలో ఎంవోయూలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

కొరాపుట్: సెంచూరియన్ యూనివర్సిటీతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. ఉత్తర ప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ వర్సిటీల మధ్య ఆగస్టు 29న ఎంవోయూ కుదిరింది. లక్నోలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా పరిశోధనాత్మక, న్యాయ సంబంధిత, సాంకేతిక అంశాల్లో రెండు సంస్థలు పరస్పరం సహకారం అందించుకుంటాయి. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ డీజీపీ రాజీవ్ కృష్ణతో వర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా సమాలోచనలు చేశారు. డీజీపీ మాట్లాడుతూ ఈ రెండు సంస్థల కలయిక పరిశోధన రంగంలో నూతన మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. సెంచూరియన్ వర్సిటీ ప్రెసిడెంట్ ముక్తి కాంత్ మిశ్రా మాట్లాడుతూ తాము 2016లోనే గుజరాత్ ఫోరెన్సిక్ విభాగంతో పనిచేశామని, ఇప్పుడు ఈ కొత్త ఒప్పందంతో ఫోరెన్సిక్ సేవలు సమాజానికి ఉపయోగపడతాయన్నారు. ఈ ఒప్పందంపై ఉత్తర్ ప్రదేశ్ ఏడీజీపీ నవీన్ అరోరా, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియ పట్నాయక్ సంతకాలు చేశారు. లక్నో లోని స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కి చెందిన డాక్టర్ సుధీర్ కుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ అంతర్జాతీయ, ప్రభుత్వ సంబంధాల డైరెక్టర్ మోనాలిసా ఘోష్, డాక్టర్ రీనా, సి.జమాతానీ పాల్గొన్నారు.